సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం ׀ 17 ׀ మే ׀ 2025



వేసవిలో వాహనాలు జాగ్రత్త

వేసవిలో వాహనాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అధిక ఉష్ణోగ్రతలతో **వాహనాలు దెబ్బతింటాయని మెకానిక్‌లు చెబుతున్నారు.** IIలో ▸



ఆవకాయ పెట్టలేం.. కొంటాం !

వేసవి వస్తే ఇళ్లల్లో ఆవకాయ సందడి మొదలవుతుంది. ఆవకాయ పచ్చడి ఉంటే చాలు ఆ రోజుకు కూర అవసరం లేదనేది **ఆంధ్రుల నమ్మకం.** IIలో ▸



అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను ఏలూరు పోలీసులు **అరెస్టు చేసి బంగారు** ఆభరణాలు, బైక్ **స్వాధీనం చేసుకున్నారు.** IIలో ▸

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ సుబ్బారెడ్డికి వేద ఆశీర్వచనం అందిస్తున్న ప్రధానార్చకులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం రాత్రి సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. న్యాయమూర్తి సుబ్బారెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు ఆయనకు శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు. న్యాయమూర్తి వెంట భీమడోలు కోర్టు జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి ఉన్నారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

భీమవరం: జిల్లాలోని 40 కేంద్రాల్లో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు 91 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. ఫస్టియర్ జనరల్ కేటగిరీలో 4,844 మందికి 4,477 మంది, ఒకేషనల్ కేటగిరీలో 645 మందికి 569 మంది హాజరయ్యారన్నారు. సెకండియర్ జనరల్ కేటగిరీలో 903 మందికి 810 మంది, ఒకేషనల్ కేటగిరీలో 146 మందికి 125 మంది హాజరయ్యారని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని చెప్పారు.

వెబ్‌సైట్‌లో వాహన పన్ను చెల్లించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని వాహన యజమానులు త్రైమాసిక పన్నును వెబ్‌సైట్‌లో చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. జూన్ 30లోపు పన్ను చెల్లించకుంటే 25 శాతం అపరాధ రుసుం విధిస్తామన్నారు. పన్ను చెల్లించకుండా తిరిగితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు 200 శాతం పెనాల్టీ పడుతుందని పేర్కొన్నారు. అలాగే పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ ధ్రువీకరణ పొందిన తర్వాతే విద్యార్థులను బస్సుల్లో తీసుకువెళ్లాలని సూచించారు.

రోడ్డు భద్రతకు పటిష్ట చర్యలు

భీమవరం (ప్రకాశం చౌక్): రోడ్డు భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టి, ప్రమాదాలు నివారణకు కృషి చేయాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. లింగ నిర్ధారణ పరీక్షలను ఉపేక్షించబోమని, స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో పీసీ–పీఎన్‌డీటీ యాక్ట్, ఏఆర్టీ అండ్ సరోగసి యాక్ట్ అమలుపై ఆమె సమీక్షించారు. అలాగే మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి పథకాలపై కలెక్టర్ సమీక్షించారు.

లభ్యం కాని బాలుడి వివరాలు



శిశు గృహలో ఉన్న బాలుడు

ద్వారకాతిరుమల: స్థానిక యూనియన్ బ్యాంకు సమీపంలో ఈనెల 9న ఒంటరిగా తిరుగుతూ కనిపించిన ఐదేళ్ల బాలుడిని స్థానికులు పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. బాలుడు తన పేరు గోపాల్ అని, తండ్రి పేరు నాయక్ అని మాత్రమే చెబుతున్నాడు. అంతకు మించి వివరాలు చెప్పలేకపోవడంతో బాలుడిని ఏలూరులో జిల్లా శిశు గృహానికి తరలించి, తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్టు డీసీపీఓ సీహెచ్ సూర్య చక్రవేణి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బాలుడి వివరాలు తెలియలేదని, ఎవరికైనా తెలిస్తే సెల్ 94910 63810, లేదా ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ 94407 96653, చైల్డ్ హెల్ప్‌లైన్ కో–ఆర్డినేటర్ వైవీ రాజు 77027 48404 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

కన్న తండ్రినే కడతేర్చాడు

దెందులూరు: కుమారుడు దాడి చేయడంతో తండ్రి మృతి చెందిన ఘటన మండలంలోని ఉండ్రాజవరంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఉండ్రాజవరం గ్రామానికి చెందిన అంబల్ల సింహాచలం (72)పై అతడి పెద్ద కుమారుడు సన్యాసిరావు రోకలి బండతో దాడి చేశాడు. దీంతో తీవ్రగాయాలైన సింహాచలం అక్కడికక్కడే మృతిచెందాడు. సన్యాసిరావు తరచుగా తండ్రితో గొడవ పడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న సింహాచలంతో గొడవ పడి రోకలి బండతో మోదడంతో సింహాచలం అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు

సమస్యలపై ప్రజాపోరు

- ప్రజలతో నేతలు మమేకమవ్వాలి
- ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అండ
- ఆక్వా రైతులకు వెన్నుదన్ను
- క్షేత్రస్థాయి పర్యటనలకు అధినేత జగన్
- ప్రతి 10 రోజులకూ జిల్లా సమావేశం
- త్వరలో మండల, గ్రామ కమిటీల నియామకం
- పార్టీ నేతలకు రీజినల్ కో–ఆర్డినేటర్ బొత్స దిశానిర్దేశం
- కాకినాడలో ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్‌సీపీ సమావేశం



వైఎస్సార్‌సీపీ ఉభయ గోదావరి జిల్లాల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రీజినల్ కో–ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ. చిత్రంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ వంకా రవీంద్ర

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సమస్యలపై ప్రజా భాగస్వామ్యంతో ప్రభుత్వాన్ని మేలుకొల్పేలా పోరుబాటకు వైఎస్సార్ సీపీ సిద్ధమవుతోంది. ఇందుకు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా రానున్న రెండు నెలల్లో మండల, గ్రామ కమిటీల నియామకాలు పూర్తి చేయాలని పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పార్టీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేశారు. వచ్చే జూన్‌లోపు ఇంకా మిగిలిన మండలాలు, జూలైకల్లా గ్రామస్థాయి కమిటీల నియామకాలు పూర్తి చేయాలని సూచించారు. కాకినాడ డి–కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగిన పార్టీ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవ్వాలనేది ప్రధాన అజెండాగా నిర్ణయించారు. ఇందుకోసం ప్రజల సమస్యలపై పార్టీ స్థానిక నాయకత్వాలు శాంతియుత పంథాలో నిరసన కార్యక్రమాలు రూపొందించుకోవాల్సి ఉంటుంది. ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి నాయకత్వాన నిర్వహించిన ఆందోళనలపై సమీక్షలో చర్చించారు. ఇదే తరహాలో సమస్యలపై పోరుబాటకు సన్నద్ధం కావాలని నేతలకు బొత్స సూచించారు. జిల్లాస్థాయిలో సైతం పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని తీర్మానించారు. దీని కోసం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో 50 రోజుల కార్యక్రమాన్ని ఖరారు చేశారు. వచ్చే జూన్ 1 నుంచి ప్రతి 10 రోజులకు ఒక జిల్లాలో పార్టీ జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశాలను ఐదు జిల్లాల్లో 50 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

సమావేశంలో పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు వంకా రవీంద్ర, కవురు శ్రీనివాస్, మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత, పార్లమెంటరీ కో–ఆర్డినేటర్లు కారుమూరి సునీల్‌కుమార్, నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, అసెంబ్లీ కో–ఆర్డినేటర్ గుడాల గోపి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి వచ్చిన పార్టీ నేతలు

రైతులకు అభయం.. సమస్యలపై సమరం

- ప్రధానంగా వివిధ సమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించారని బొత్స తెలిపారు. ధాన్యం కల్లాల్లో ఉన్నా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయంపై ఈ సందర్భంగా చర్చించారు. ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితికి పొంతనే లేదని నేతలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంలో రైతుల ఇబ్బందులు తెలుసుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించి, వారితో మాట్లాడి, అండగా నిలవాలని నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు.
- ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న నష్టాలకు ప్రభుత్వ విధానాలే కారణమని నిర్ధారించారు. రొయ్యల ధరలు పడిపోవడం, మేత ధరలు అడ్డగోలుగా పెరిగిపోయి రైతులు నష్టపోతున్నా సర్కార్‌కు చీమ కుట్టినట్టయినా లేదని, ఆక్వా రైతులకు వెన్నంటి నిలవాలని తీర్మానించారు.
- గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో మాదిరిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పొగాకు రైతులకు అండగా నిలిచి, పోరాడటానికి సిద్ధంగా ఉండాలని నిర్ణయించారు.
- ప్రధానమైన ప్రజాసమస్యలపై పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు సైతం సిద్ధంగా ఉన్నారని బొత్స సత్యనారాయణ వివరించారు.
- సూపర్ సిక్స్ సహా కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలయ్యే వరకూ ప్రభుత్వంపై ప్రజాపోరులో ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యేలా బాధ్యత తీసుకోవడానికి నాయకులు ముందుకు వచ్చారు.
- క్షేత్రస్థాయిలో పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, పార్టీ శ్రేణులు, ప్రజలకు అండగా నిలిచి, మనోధైర్యం కల్పించాలని సమావేశంలో తీర్మానించారు.

కాలువ గట్టు.. పూడిక తీసికట్టు

- పూడిక తీసిన మట్టి మళ్లీ కాలువలోకే..
- కొద్దిపాటి వర్షానికే జారిపోయిన గట్లు
- 'సాక్షి' చెప్పినట్టే జరిగింది

ఉండి: అనుకున్నంత అయ్యింది.. చెప్పినట్టే జరిగింది.. ఉండి కాలువ పూడికతీత పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం చోటుచేసుకుందని, చినుకుపడితే పూడిక తీసిన మట్టి మళ్లీ కాలువలోకి వెళ్లిపోతుందని ఈనెల 13న 'సాక్షి'లో 'మట్టి తీసి గట్టు మీద పెట్టు' శీర్షికన కథనం ప్రచురించింది. ఈనెల 15న సాయంత్రం ఉండి మండలంలో కురిసిన కొద్దిపాటి వర్షానికే కలిసిపూడి గ్రామంలో ఉండి కాలువలో చేపట్టిన పూడిక తీత మట్టి మళ్లీ కాలువలోకే జారిపోయింది. నామమాత్రంగా పనులు చేపట్టడం, పూడిక తీసిన మట్టి మరలా కాలువలోకే జారిపోవడంపై రైతులు మండిపడుతున్నారు. కలిసిపూడి రెగ్యులేటర్ నుంచి కాలువ శివారు అజ్జమూరు వరకు రూ.33 లక్షలు అంచనా కాగా అగ్రిమెంట్‌గా రూ.22 లక్షలతో పనులు చేపట్టారు. కాలువలో నీరు ఉండగానే పూడికతీత పనులు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అయినా ఇవేమీ పట్టించుకోకుండా కాంట్రాక్టర్, అధికారులు తూతూమంత్రంగా రాత్రిళ్లు పనులు చేపట్టారు. కాలువలో తీసిన మట్టి గట్లపై వేస్తుండటంపై ప్రజల నుంచి వ్యతిరేకత కూడా వ్యక్తమైంది. కాలువ నుంచి తీసిన పూడికతీత మట్టి గట్ల అంచుల్లో పూసేస్తున్నారు. దీంతో కొద్దిపాటి వర్షానికే అంచుల్లోని మట్టి కాలువలోకి జారిపోయింది.



కలిసిపూడిలో కాలువలోకి జారిపోయిన పూడికతీత మట్టి



ఉండి కాలువ గట్టు ఇలా..

నీళ్లు నములుతున్న అధికారులు

'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా నాయకులు, అధికారులు ఈనెల 14న ఉండి ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కాలువలో తీసిన మట్టి గట్లపై కాకుండా ఎక్కడ వేస్తారు అంటూ ఛలోక్తులు విసురుకున్నట్టు సమాచారం. అయితే ఇప్పుడు కాలువలోకి జారిన మట్టిపై ఎవరు సమాధానం చెబుతారనేది ప్రశ్నార్థకం. దీనిపై అధికారులను వివరణ కోరగా నీళ్లు నములుతున్నారు. కాలువలోకి జారిన మట్టిని తొలగిస్తారా అని ఏఈ ఫణిశంకర్‌ను ప్రశ్నించగా కాలువలోకి జారితే తీసేస్తామంటూ సమాధానమిచ్చారు. దీనిని బట్టి పూడికతీత పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదని అర్థమవుతోంది. కాలువలోకి జారిపోయిన మట్టిన మరలా ఎప్పుడు తొలగిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

డ్వాక్రా మహిళలకు తెలియకుండా రుణాలు

- ఖాతాల్లోకి రూ.75 లక్షల జమ!
- 5 నెలల తర్వాత తెలిసి కంగుతిన్న సంఘ సభ్యులు
- వడ్డీ కట్టాలంటున్న అధికారులు



బుట్టాయగూడెంలో ఎంపీడీఓకు గోడు చెప్పుకుంటున్న డ్వాక్రా సంఘాల మహిళలు

బుట్టాయగూడెం: తమకు తెలియకుండా తమ ఖాతాల్లో డ్వాక్రా రుణాల సొమ్ములు జమచేశారని, ఐదు నెలల తర్వాత తెలిసి ప్రశ్నిస్తే ఆ సొమ్ములకు వడ్డీ కట్టాలని బ్యాంకు అధికారులు అంటున్నారని మండలంలోని గాడిదబోరుకు చెందిన గిరిజన మహిళలు లబోదిబోమంటున్నారు. తమ ఖాతాల్లో సుమారు రూ.75 లక్షల వరకు సొమ్ములు జమయ్యాయని చెబుతున్నారు. డ్వాకా సంఘాల మహిళ టి.గంగాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. గాడిదబోరుకు చెందిన ధనలక్ష్మి, మహాలక్ష్మి, ప్రియదర్శిని, ముత్యాలమ్మ, స్నేహలత, ప్రభ అనే ఆరు గ్రూపులకు రెడ్డిగణపవరంలోని ఓ బ్యాంకు 2021లో రూ.19 లక్షల చొప్పున డ్వాక్రా రుణాలు మంజూరు చేసింది. అప్పటినుంచి గ్రూపు సభ్యులు నెలవారీ వాయిదాలు చెల్లిస్తున్నారు. ఇంకా రూ.5 లక్షల వరకు బకాయిలు ఉండగా తాజాగా డ్వాక్రా మహిళలు బ్యాంకుకు వెళ్లి రుణాల లావాదేవీల స్టేట్‌మెంట్ తీయించారు. అయితే ఒక్కో ఖాతాలో రూ.19 లక్షల వరకు బకాయి ఉన్నట్టు తెలిసి మహిళలు కంగుతిన్నారు. దీనిపై బ్యాంకు అధికారులను ఆరా తీయగా ఐదు నెలల క్రితం ఒక్కో ఖాతాలో రూ.12.20 లక్షల రుణం జమైందని, వడ్డీతో కలిపి రూ.19 లక్షల వరకు అయ్యిందని చెప్పారు. కొత్త రుణం కోసం తామేమీ దరఖాస్తు చేయలేదని, దీనిపై తమకు బ్యాంకు నుంచి లేదా వెలుగు అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదని మహిళలు అంటున్నారు. ఒక్కో సంఘం రూ.78 వేలు వడ్డీ కింద కట్టాలని బ్యాంకు అధికారులు చెబుతున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు. డ్వాక్రా మహిళలు శుక్రవారం ఎంపీడీఓ కె.జ్యోతిని కలిసి సమస్యను తెలియజేశారు. బ్యాంక్ మేనేజర్‌తో ఎంపీడీఓ జ్యోతి ఫోన్‌లో మాట్లాడగా తాను సెలవులో ఉన్నానని సోమవారం అన్ని విషయాలు చెప్తానని మేనేజర్ సమాధానమిచ్చారు. వడ్డీ రూపంలో బ్యాంక్ అధికారులు తమ కష్టాన్ని దోచుకుంటున్నారని విషయాన్ని సోమవారం కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని మహిళా సంఘాల సభ్యులు అన్నారు.

నష్టాల్లో మగ్గుతున్న మామిడి రైతు

- 50 శాతం పతనమైన ధర
- బంగినపల్లి, తోతాపురి ధరల క్షీణత
- దిగుబడి తగ్గినా.. ధర పెరగని పరిస్థితి
- అకాల వర్షాలు, తెగుళ్లతో నాణ్యతలేమి
- తీవ్ర నష్టాల్లో మామిడి రైతులు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: నూజివీడు మామిడికి కళ తప్పింది. సాధారణంగా దిగుబడి తగ్గితే పంట ధర పెరుగుతుంది. కానీ మామిడి విషయంలో దిగుబడితో పాటు ధరలు కూడా భారీగా పతనమయ్యాయి. తెగుళ్లతో నాణ్యత పడిపోవడం దీనికి ఒక కారణంకాగా, ఈ పరిస్థితిని లాభంగా మార్చుకుంటున్న సిండికేట్ వైఖరి మరో కారణం.

'సాగు' క్షీణత : ఏలూరు జిల్లాలో నూజివీడు, చింతలపూడి నియోజకవర్గాల్లో మామిడి సాగు గణనీయంగా ఉంది. నూజివీడు మామిడికి దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయంగాను మంచి డిమాండ్ ఉంటుంది. మూడేళ్ల క్రితం అమెరికాకు కూడా మామిడి ఎగుమతి చేసిన పరిస్థితి. జిల్లాలో 15 ఏళ్ల క్రితం వరకు 80 నుంచి లక్ష ఎకరాల్లో విస్తరించి ఉన్న మామిడి సాగు వరుస నష్టాలు, తుపానుల ధాటికి క్రమంగా తగ్గుతూ, ప్రస్తుతం 52 వేల ఎకరాలకు పడిపోయింది. ఈ సీజన్‌కు సంబంధించి గత డిసెంబర్‌లో మంచి పూత వచ్చినా నల్లతామర తెగులుతో సుమారు 60 నుంచి 70 శాతం మేర దిగుబడి తగ్గిపోయింది. జిల్లాలో ప్రధానంగా బంగినపల్లి, తోతాపురి (కలెక్టర్ కాయలు), చిన్నరసాలు, పెద్దరసాల సాగు అధికంగా ఉంటుంది.

దేశీయ మార్కెట్‌కే పరిమితం

ఈ ఏడాది జిల్లాలో 1.35 లక్షల టన్నుల దిగుబడి అంచనా కాగా, తెగుళ్ల ధాటికి 50 వేల టన్నులకే పరిమితమైంది. ప్రధానంగా బంగినపల్లి, తోతాపురిలు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌తో పాటు ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు అవుతుండగా చిన్నరసాలు, పెద్దరసాలు రాష్ట్రంలో విక్రయాలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో గతేడాది బంగినపల్లి రకం టన్ను రూ.25 వేల నుంచి రూ.30 వేలు, తోతాపురి టన్ను రూ.13 వేల నుంచి రూ.15 వేల ధరకు విక్రయించారు. అయితే ఈ ఏడాది సీజన్ ప్రారంభమైన మార్చిలో పంట దిగుబడి లేకపోవడంతో బంగినపల్లి రకం టన్ను ధర రూ.80 నుంచి రూ.లక్ష వరకు పలికి, క్రమక్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రూ.15 వేలకు చేరింది. అలాగే తోతాపురి కూడా ప్రారంభంలో అత్యధికంగా రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పలికిన ధర ప్రస్తుతం రూ.8 వేలకు వేలకే పరిమితమైంది.

మార్కెట్‌లో తగ్గిన హవా

ఏటా మార్చి నెలాఖరు నుంచి మే నెలాఖరు వరకు నూజివీడు మామిడి విజయవాడ మ్యాంగో మార్కెట్ ద్వారా ఎగుమతులు జరుగుతుంటాయి. ప్రధానంగా నూజివీడు వెరైటీకి మహారాష్ట్ర, గుజరాత్‌లో మంచి డిమాండ్ ఉండటంతో అక్కడ వ్యాపారులు ప్రత్యేకంగా స్థానిక మార్కెట్‌లో కొనుగోలు చేసే పరిస్థితి. అయితే ప్రస్తుత పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉండటంతో దేశీయ మార్కెట్‌లో నూజివీడు హవా పూర్తిగా తగ్గి తెలంగాణ, ఉలవపాడు మామిడికి కొంత డిమాండ్ పెరిగింది.


తీవ్ర నష్టం



ఈ ఏడాది మామిడి తోటల వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అసలే దిగుబడి తక్కువ ఉండగా వరుసగా గాలిదుమ్ములు, వర్షాలు పడటంతో కాయలు రాలిపోవడం, ఉన్న కాయలు నాణ్యత కోల్పోవడం జరిగింది. ఎరువులు, పురుగు మందులకు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు.

– మందపాటి రఘుపతిరెడ్డి, సి.గుడిపాడు, చాట్రాయి మండలం

అప్పులు చేసి పెట్టుబడి



నాకు మూడు ఎకరాలు మామిడి తోట ఉంది. ఈ ఏడాది వచ్చిన మామిడి పూతను చూసి ధైర్యంతో అప్పులు తెచ్చి ఎకరానికి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాం. సంక్రాంతి తర్వాత నల్లతామర ఆశించడంతో పూతంతా మాడిపోయింది. ప్రస్తుతం నష్టం వచ్చే పరిస్థితి ఉంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– గుండ్ల హనుమంతరావు, అడవి నెక్కలం, ఆగిరిపల్లి మండలం

20 ఏళ్లలో ఎన్నడూ లేదు



బంగినపల్లి, తోతాపురి ధరలు పూర్తిగా పతనమయ్యాయి. ఏమాత్రం నాణ్యత లేకపోయినా మార్కెట్‌లో కాయలను దించుకోవడం లేదు. తెగుళ్లు, అకాల వర్షాల వల్ల కాయలు నాణ్యత కోల్పోయాయి. మామిడికి ఇలాంటి పరిస్థితులు 20 ఏళ్లలో ఎన్నడూ లేవు. వ్యాపారులు అప్పుల్లో కూరుకుపోయారు.

–పెదగమ్మళ్ల ఆదినారాయణ, మామిడి వ్యాపారి, నూజివీడు

సారారహిత జిల్లాగా పశ్చిమ



ఉపాధికి చెక్కు అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: పశ్చిమగోదావరి సారారహిత జిల్లాగా ప్రకటించుకోవడం ఆనందంగా ఉందని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన నవోదయం 2.0 కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సారా తయారీ, విక్రయదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కోసం రుణాలు అందిస్తున్నామన్నారు. ఇలా జిల్లాలో గుర్తించిన 13 మందికి రూ.లక్ష చొప్పున రూ.13 లక్షల చెక్కును అందించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ సారా తయారీ, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత మాట్లాడుతూ జిల్లాలో సారా వృత్తిలో ఉన్న వారిని గుర్తించి ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆర్ఎస్ కుమరేశ్వరన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగ ప్రభుకుమార్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై..

మాదకద్రవ్యాల నియంత్రణకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆధ్వర్యంలో ఎన్ కార్డ్ (జిల్లాస్థాయి కమిటీ ఫర్ బెటర్ కో–ఆర్డినేషన్ ఇన్ కంట్రోలింగ్ గంజాయి–ఇతర మాదకద్రవ్యాల నియంత్రణ)పై సమావేశాన్ని నిర్వహించారు. డ్రగ్స్ అనర్థాలపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు.

క్లుప్తంగా

కలెక్టర్ నాగరాణికి సత్కారం



కలెక్టర్ నాగరాణిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేసుకుంటున్న మహిళలను గౌరవించాలని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివంగత ఉద్దరాజు వెంకట లక్ష్మీనరసయ్య 50వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆనంద ఫంక్షన్ హాల్లో ఆనంద స్త్రీ పురస్కారాల ప్రదానం చేశారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు సతీమణి అన్నపూర్ణ, ప్రముఖ సంగీత విద్వాంసురాలు డా.కొల్లూరి వందన (తిరుపతి), జిల్లా వైద్య అధికారిణి గీతాబాయి, పోలీస్ శాఖ, ఆనంద గ్రూప్‌కు చెందిన ఆరుగురు ఉత్తమ సేవాతత్పరులకు, 50 మంది మున్సిపల్ మహిళ పారిశుద్ధ్య కార్మికులకు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఉద్ధరాజు కాశీ విశ్వనాథ్ రాజు, కంతేటి వెంకటరాజు, దాయన చంద్రజీ, రఘుపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కలప స్వాధీనం



కన్నాపురం అటవీశాఖ కార్యాలయంలో సీజ్ చేసిన కలప ట్రాక్టర్

కొయ్యలగూడెం : అక్రమంగా కలప రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు కన్నాపురం అటవీశాఖ అధికారి రేంజర్ శివరామకృష్ణ శుక్రవారం పేర్కొన్నారు. యర్రంపేట, ఆరిపాటి గ్రామాల మధ్య బండారు జాతికి చెందిన భారీ వృక్షాలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. కలప విలువను లెక్కించాల్సి ఉందని పేర్కొన్నారు.

చాట్రాయిలో భారీ వర్షం



సూరంపాలెంలోని వరి పొలాల్లో నిలిచిన నీరు

చాట్రాయి : చాట్రాయిలో శుక్రవారం ఉదయం భారీ వర్షం కురిసింది. కొటపాడులో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగగా చెట్లు కూలిపోయాయి. ఈ వర్షం మెట్ట దుక్కులకు అనువుగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. చనుబండ పాత దళితవాడ రోడ్డు జలమయ్యవడంతో కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

డ్రైవర్‌కు ఏడేళ్ల జైలు

కొయ్యలగూడెం : లారీతో ఢీకొట్టి వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ శుక్రవారం పేర్కొన్నారు. 2018లో చెరుకూరి నరసింహ కొయ్యలగూడెం చేపల మార్కెట్ వద్ద పులిరామన్నగూడెంకు చెందిన నడపాల మంగిరెడ్డిని ఢీకొట్టాడు. దీనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా కొవ్వూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి జీవీఎల్ సరస్వతి శిక్ష విధించారన్నారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారన్నారు.

ఆవకాయ పెట్టలేం.. కొంటాం!

- ఇదివరకటిలా పెట్టేంత తీరిక లేదంటున్న మహిళలు
- అవసరమైన సరకులు మార్కెట్‌లో కొంటున్న వైనం
- రెడీమేడ్ పచ్చడి కొనేందుకు మరికొందరు మొగ్గు





మార్కెట్లోనే మామిడి ముక్కలు కొడుతున్న మహిళ

పాలకొల్లు సెంట్రల్: వేసవి వస్తే ఇళ్లలో ఆవకాయ సందడి మొదలవుతుంది. ఆవకాయ పచ్చడి ఉంటే చాలు ఆ రోజుకు కూర అవసరం లేదనేది ఆంధ్రుల నమ్మకం. ముద్దపప్పుతో ఆవకాయ కలుపుకుని తింటే ఆ రుచే వేరు. సంవత్సరం మొత్తానికి సరిపడేలా మామిడితో రకరకాల పచ్చళ్లు తయారు చేసి జాగ్రత్త చేసుకుంటారు. అయితే ఇప్పుడు ఇళ్లలో ఆవకాయ పెట్టుకునే వారి సంఖ్య తగ్గింది. మార్కెట్‌లో రెడీమేడ్‌గా దొరుకుతుండడంతో వాటితోనే సరిపెట్టుకుంటున్నారు.

వేసవి సీజన్ వస్తుందంటే మహిళలు పచ్చడి తయారీలో బిజీగా గడిపేవారు. అయితే ఇప్పటి బిజీ లైఫ్‌లో ఆవకాయ పెట్టలేం.. కొంటాం అంటున్నారు మహిళలు.. ఇప్పుడు అన్ని మార్కెట్‌లోనే కొనేస్తున్నారు. మామిడి కాయల ముక్కలు కూడా మార్కెట్‌లో అమ్ముతున్నారు. కారం, శుభ్రం చేసిన మెంతులు, ఆవాలు, వెల్లుల్లి పాయలు ఇలా పచ్చడి తయారీకి కావలసిన అన్ని రకాల సరుకులు దొరుకుతున్నాయి. ఇప్పటికీ కొందరు అన్నీ ఇంట్లోనే తయారుచేసుకుని పచ్చడి పెడుతుంటే.. కొందరు మాత్రం అవసరమైన దినుసులు మార్కెట్‌లో కొనుగోలు చేసి పచ్చళ్లు పెడుతున్నారు. మరికొందరు ఈ గొడవ అంతా ఎందుకని.. రెడీమేడ్ పచ్చళ్లు కొనేస్తున్నారు. జనంలో నేడు పచ్చడిపై మక్కువ తగ్గడానికి కారణం రెడీమేడ్‌గా నాణ్యమైన పచ్చళ్లు మార్కెట్లో దొరకడం. అలాగే పచ్చడికి అవసరమైన సరకుల ధరలు పెరగడం. పిల్లల చదువులు, ఫోన్లతో బిజీగా ఉండడం వంటివి..

ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చడికి అవసరమైన సరకులు దొరుకుతున్నాయి. వీటి ధరలు పరిశీలిస్తే..

లావు మిరపకాయల కారం కిలో	రూ.560
వేరుశనగ నూనె కిలో	రూ.155
పప్పు నూనె కిలో	రూ.450
ఆవాలు కిలో	రూ.120
మెంతులు కిలో	రూ.120,
వెల్లుల్లి కిలో	రూ.140

క్వాలిటీని బట్టి ధరలు మారుతున్నాయి.

మామిడి కాయల ధరల విషయానికొస్తే..

ఆవకాయకు వాడే

చిన్న రసాలు వంద	రూ.1000
దేశవాళీ కాయలు	రూ.1000
సువర్ణరేఖ	రూ.1500
ఐజర్లు	రూ.1500
కొత్తపల్లి కొబ్బరి	రూ.1800

మాగాయి పచ్చడికి వాడే పెద్ద రసాలు వంద కాయలు రూ.1200 వరకూ విక్రయిస్తున్నారు.

సొంతంగా పెట్టుకుంటేనే రుచి



పచ్చడి నిల్వ ఉండాలంటే సొంతంగా తయారు చేసుకుంటేనే మేలు. గానుగ నూనె వాడుకోవడం మంచిది. పూర్వం రెండు మూడు కుటుంబాల మహిళలు కలిపి పచ్చడి పెట్టేవారు. నేడు ఎవరి పని వారిదే అన్నట్లు ఉంది. మార్కెట్ రెడీమేడ్ పచ్చళ్లు దొరుకుతుండడంతో పచ్చళ్లు పెట్టడానికి కొంతమంది మొగ్గు చూపడంలేదు. ఎంత కష్టమైనా కనీసం పాతిక కాయలతోనైనా తయారు చేసుకుని రుచిచూడాల్సిందే.

దూడే వరలక్ష్మి, గృహిణి, పాలకొల్లు

మామిడి ధరలు తగ్గాయి



తూర్పుగోదావరి జిల్లాలో గూడపల్లి, లక్కవరం, బట్టేలంక, పశ్చిమగోదావరి జిల్లాలో సీతారామపురం, మొగల్తూరు ప్రాంతాల నుంచి మామిడి కాయలు ఖరీదు చేస్తుంటాం. గత సంవత్సరంతో పోలిస్తే.. కాపు ఎక్కువగా ఉండడం వల్ల ధరలు బాగా తగ్గాయి. ఐజర్లు, కొత్తపల్లి కొబ్బరి గత సంవత్సరం కాయ రూ. 35 నుంచి 50 వరకూ విక్రయించాం. ఈ సంవత్సరం రూ.15 నుంచి రూ.20కి విక్రయిస్తున్నాం.

– కటకంశెట్టి మల్లి, వ్యాపారి, పాలకొల్లు

కార్టూనిస్టుకు విశిష్ట బహుమతి



రాష్ట్ర స్థాయి బహుమతి గెలుచుకున్న గోపాలకృష్ణ కార్టూన్

పెనుగొండ : కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్టూన్ల పోటీలో పెనుగొండకు చెందిన కార్టూనిస్టు వేంద్ర గోపాలకృష్ణ కార్టూన్‌కి విశిష్ట బహుమతి లభించింది. గోపాలకృష్ణ విలేకర్లతో మాట్లాడుతూ తొలి తెలుగు వ్యంగ్య చిత్రకారుడు తలిశెట్టి రామారావు జయంతి పురస్కరించుకొని నిర్వహించిన పోటీలో ఈ బహుమతి గెలుచుకున్నట్లు చెప్పారు. ఈ నెల 20న రవీంద్రభారతీలో పురస్కారాన్ని అందుకోనున్నట్లు తెలిపారు.

రైలు నుంచి జారి యువకుడి మృతి

భీమడోలు: ఓ యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. భీమడోలు రైల్వే ఎస్సై సైమన్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం సహస్ర జిల్లా శౌర్య గ్రామానికి చెందిన రాహుల్‌కుమార్(23) బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పని పనిచేస్తున్నాడు. ఈ నెల 14న స్వగ్రామానికి వెళ్లే క్రమంలో బెంగళూరులో రైలెక్కాడు. జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న సమయంలో శుక్రవారం రైలు భీమడోలు రైల్వే స్టేషన్‌కు వచ్చే సరికి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుక్కెడు నీళ్లు.. గుప్పెడు గింజలు



ఏలూరు(మెట్రో) : వేసవి తాపానికి పక్షులు నీరు దొరక్క అల్లల్లాడిపోతాయి. సమయానికి నీరు, ఆహారం లేకపోవడంతో బిల్డింగుల మధ్య, కరెంటు తీగలపై చాలా వరకూ చనిపోయి కనిపిస్తుంటాయి. అలాంటి చిన్న ప్రాణాలను కాపాడాలని ఏలూరు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ప్రజలకు పలు సూచనలు చేశారు. వేసవిలో నగరాల్లో తిరిగే పక్షులు నీరు దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటాయి. అలాంటి పక్షులకు సాయం చేయాలనుకుంటే, పరిశుభ్రమైన నీరు, ఆహారం, సురక్షితమైన ఆశ్రయం కల్పించాలి. గిన్నెలో మంచినీరు ఉంచి నీడ ఉన్న ప్రదేశంలో పెట్టాలి. ప్రతిరోజూ నీటిని మార్చాలి. పక్షులు తాగేటప్పుడు, సురక్షితంగా కూర్చోవడానికి చిన్న రాళ్ళు లేదా గులకరాళ్లను ఉంచాలి.

ఆకలి తీరుద్దాం

అలాగే వేసవిలో తినేందుకు ఏమీ దొరక్క పక్షులు ఆకలితో అలమటిస్తాయి. అందువల్ల వేసవి వాతావరణానికి అనుకూలంగా ఉండే విత్తనాలు, తృణధాన్యాలు కూడా అందుబాటులో ఉంచాలి. రాగులు, పొద్దుతిరుగుడు విత్తనాలు, వరి ధాన్యం మంచివి.

ఏ పక్షులకు ఎలాంటి ఆహారం ఇవ్వొచ్చు

- **పిచ్చుకలు** : రాగులు, పొద్దుతిరుగుడు విత్తనాలు, చిరుధాన్యాలు
- **చిలుకలు**: అరటి, జామ, బొప్పాయి వంటి పండ్లు
- **కాకులు, కోకిలలు** : వండిన అన్నం, చపాతీలు, మృదువైన పండ్లు

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి



జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం సమీపంలో డివైడర్‌ను ఢీ కొట్టిన కారు, ఇన్‌సెట్‌లో మృతి చెందిన ముప్పిడి వరప్రసాద్ (ఫైల్)

బుట్టాయగూడెం : జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక పొగాకు వ్యాపారి మృతి చెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం .. కొయ్యలగూడెంకు చెందిన ముప్పిడి వరప్రసాద్, గోపాలపురానికి చెందిన పి.కృష్ణ, గుంటూరుకు చెందిన ఏ.రాంబాబు, మెదడుమెట్లకు చెందిన టి.వీరాంజనేయులు అనేజంగారెడ్డిగూడెం నుంచి జీలుగుమిల్లి పొగాకు బేళ్లు కొనేందుకు వెళ్తుండగా లక్ష్మీపురం సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి తుప్పల్లోకి దూసుకుపోయింది. గాయపడిన క్షతగాత్రులను 108లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ముప్పిడి వరప్రసాద్ అప్పటికే మృతి చెందాడు. పదేళ్లుగా మృతుడు వరప్రసాద్ పొగాకు వ్యాపారం చేస్తున్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన కావ్యకు, చాగల్లు మండలం నెలటూరుకు చెందిన జెల్లా మణికంఠకు 2023లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.2 లక్షలు కట్నం ఇచ్చారు. 5 నెలలు వీరి కాపురం బాగానే సాగినా.. మణికంఠ ఇటీవల అధిక కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నాడని, దీనికి మరో ఇద్దరు కుటుంబసభ్యులు సహకరిస్తున్నారన్నారు. విషయాన్ని కావ్య తల్లికి చెప్పడంతో పెద్దల్లో పెట్టారన్నారు. అయినప్పటికీ మణికంఠలో మార్పు రాకపోకగా, కావ్యను వేధిస్తున్నాడన్నారు. ఈ నేపథ్యంలో కావ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యలమంచిలి మండలంలో...

యలమంచిలి: తన భర్త తాగొచ్చి వేధించడమే కాకుండా అదనపు కట్నం తెమ్మంటున్నాడని కొంతేరు గ్రామానికి చెందిన గుబ్బల నాగలక్ష్మి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై గుర్రయ్య వివరాలు వెల్లడిస్తూ.. నాగలక్ష్మికి రాజోలు మండలం తాటిపాకకు చెందిన కృష్ణబాబుతో 2018లో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.2 లక్షల కట్నంతో పాటు ఆడపడుచు కట్నం రూ.లక్ష ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొంది. అదనపు కట్నం కోసం హింసించడంతో ఆమె పోలీసులను ఆశ్రయించినట్లు ఎస్సై వివరించారు.

వేసవిలో వాహనాలు జాగ్రత్త

బైక్‌లు, కార్ల నిర్వహణలో మెకానిక్‌ల సూచనలు





పాలకొల్లు సెంట్రల్ : వేసవిలో వాహనాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అధిక ఉష్ణోగ్రతల వల్ల వాహనాల రంగు మారిపోవడం, టైర్లలో గాలి తగ్గిపోవడం, పెట్రోలు ఆవిరయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల బైక్ మెకానిక్‌లు వేసవిలో బైక్‌ల రక్షణకు పలు సూచనలు చేస్తున్నారు.

నీడలో పార్కింగ్ మేలు

- వాహనాలను ఎక్కువ సమయం పార్కింగ్ చేయాల్సి వస్తే నీడ ఉన్న చోట చేయడం మేలు. ఎండ వేడికి వాహనాలు రంగు మారిపోయే అవకాశాలు ఎక్కువ.
- అధిక వేడి వల్ల టైర్లలో గాలి తగ్గిపోయే అవకాశం ఉంటుంది. తప్పని సరిగా వారానికోసారి టైర్లలో గాలిని తనిఖీ చేయించుకోవాలి. టైర్లలో గాలి తగిన మోతాదులో ఉండేలా చూసుకోవాలి.
- గాలి తక్కువగా ఉండడం వల్ల టైర్లు దెబ్బతింటాయి. ఎక్కువ గాలి ఉన్నా.. ఎండ వేడికి రన్నింగ్‌లో టైరు పేలిపోయే ప్రమాదాలు ఉంటాయి.
- ఎక్కువ సమయం వాహనం ఎండలో ఉండడం వల్ల పెట్రోల్ ఆవిరయ్యే పరిస్థితి ఉంటుంది. వాహనాల్లో పగలంతా తిరిగి ఇంటికి చేరుకుంటాం. ఆ సమయాల్లో పెట్రోల్ ట్యాంక్ మూతను ఓ పది నిమిషాలు తీసి ఉంచితే మేలు. ట్యాంకులో కొంతవరకూ గ్యాస్ స్టోరయ్యే పరిస్థితి ఉంటుంది. మూత తీసి ఉంచితే గ్యాస్ బయటకు పోతుంది. వేసవిలో ఆయిల్‌ను సాయంత్రం కొట్టించడం మేలు.
- దూర ప్రయాణం చేసేటప్పుడు.. వాహనాలు ఎక్కువ వేడెక్కుతాయి. కొంతదూరం ప్రయాణం చేశాక ఇంజన్ ఆపి కొద్దిసేపు సేద తీరడం మంచిది.

కార్లు, భారీ వాహనాల విషయంలో జాగ్రత్తలు

- కార్లు, లారీలు, ఇతర భారీ వాహనాల విషయంలో రేడియేటర్లలో నీటి శాతం తరచూ చూసుకోవాలి. రేడియేటర్లలో నీళ్ల కంటే కూలెంట్ ఆయిల్ వాడడం మంచిది.
- వాహనాల్లో ఇంజన్ ఆయిల్ శాతం తరచూ చూసుకోవాలి.
- వేసవిలో సాధ్యమైనంత వరకూ సీఎన్‌జీ వాహనాల్లో ప్రయాణం తగ్గించుకుంటే మంచిది. ఏసీ నిలబడాలంటే కారు అద్దాలకు క్లాత్ మ్యాట్స్ ఏర్పాటు చేసుకోవాలి.
- భారీ వాహనాలకు కొత్త టైర్లు వాడితే ఉత్తమం. దూర ప్రాంతాలకు ప్రయాణం సమయంలో పాత టైర్లు వేడెక్కి గాలి తగ్గిపోతుంది. పేలిపోవడం వంటి ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు.

వేసవిలో ఫుల్ ట్యాంక్ వద్దు



బైక్‌లు కొందరు ఫుల్ ట్యాంక్ చేయించుకునే అలవాటు ఉంటుంది. వేసవిలో ఫుల్ ట్యాంక్ చేయించకుండా ఉంటే మేలు. వాహనాన్ని పార్కింగ్ చేసే సమయంలో తప్పనిసరిగా నీడ ప్రాంతాన్ని చూసుకోవాలి. వేడికి పెట్రోల్ ఆవిరవ్వడమే కాకుండా రంగు మారే అవకాశాలు, గాలి తగ్గడం వంటివి జరుగుతాయి.

వర్థినీడి ఉమా, బైక్ మెకానిక్, పాలకొల్లు

ఆగి ప్రయాణం చేయడం ఉత్తమం



రేడియేటర్లలో నీళ్లు లేకపోవడం వల్ల ఇంజిన్ వేడెక్కి వైరింగ్ షార్టయ్యే ప్రమాదం ఉంటుంది. వేసవిలో సుమారు 200 కి.మీ దూరం ప్రయాణం చేసిన అనంతరం ఎక్కడైనా వాహనాన్ని పార్కింగ్ చేసుకుని ఇంజిన్ కూల్ అయ్యాక మళ్లీ ప్రయాణం చేయడం ఉత్తమం. వాహనం హీట్ ఉన్నప్పుడు టైర్లు వెడెక్కుతాయి. వాటిపై నీళ్లు వేస్తే టైర్‌పై ఎయిర్ బబుల్స్ వచ్చి టైర్లు పేలిపోయే ప్రమాదం ఉంటుంది.

– పడమటి సూరిబాబు, లారీ యజమాని, పాలకొల్లు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు



చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు

ఏలూరు టౌన్ : దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేసి అతని నుంచి బంగారు ఆభరణాలు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. త్రీటౌన్ స్టేషన్‌లో సీఐ కోటేశ్వరరావు వివరాల ప్రకారం.. త్రీటౌన్ పరిధిలోని సౌభాగ్యలక్ష్మి అమ్మవారి గుడి, వన్‌టౌన్ పరిధిలోని రెండు దేవాలయాల్లో దొంగతనాలపై కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సీసీఎస్ సీఐ సీహెచ్ రాజశేఖర్, త్రీటౌన్ ఎస్ఐ పీ.రాంబాబుతో పాటు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలు జరిగిన తీరును పరిశీలిస్తూ... సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా శుక్రవారం ఏలూరు మినీబైపాస్ రోడ్డులో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. చోరీలకు పాల్పడుతున్న కొత్తపేట ఈమని రాంబాబును అరెస్ట్ చేసి అతని నుంచి 30 గ్రాముల బంగారు అభరణాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేయాలనుకునే గుడిని ఎంచుకుని, భక్తుడిలా గుడిలోకి వెళ్తాడు. పూజారితో మాటలు కలిపి భక్తుడిలా కలరింగ్ ఇస్తాడు. పూజారి పరధ్యానంగా ఉన్న సమయంలో దేవుడికి, అమ్మవారికి అలంకరించిన బంగారు వస్తువులు చోరీ చేస్తూ పరారవుతాడని త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు. రాంబాబుపై కృష్ణా, గుంటూరు జిల్లాలోను కేసులున్నాయని తెలిపారు. రాంబాబుపై రాష్ట్ర వ్యాప్తంగా 50కిపైగా చోరీ కేసులు నమోదయినట్లు చెప్పారు.

విరబూసిన అందం



మండలంలోని వెంకటకృష్ణాపురంలో మే పుష్పాలు చూపరులను అబ్బురపరుస్తున్నాయి. దేవినేనివారిగూడెంలోని ఎంపీపీ పాఠశాల-1 లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గెద్దం దేవానందరావు ఇంటి ఆవరణలోని కుండీల్లో ఈ పుష్పాలు వికసించాయి. ఏటా మే నెలలో ఈ పుష్పాలు పూస్తాయని తెలిపారు.

– ద్వారకాతిరుమల

ఆర్టీఏ లైసెన్స్ తప్పనిసరి



పార్శిల్స్ రవాణా సంస్థల యాజమాన్య ప్రతినిధులకు అవగాహన కలిగిస్తున్న డీటీసీ కరీం

ఏలూరు (ఆర్ఆర్ పేట): కేంద్ర ప్రభుత్వం రూపొందించిన క్యారేజ్ బై రోడ్ యాక్ట్ – 2007, క్యారేజ్ బై రోడ్ రూల్స్ – 2011 ప్రకారం వినియోదారుల నుంచి స్వీకరించిన పార్శిళ్లను స్టోర్ చేసి, వాటిని గమ్యస్థానాలకు చేరవేసే రవాణా సంస్థలు తప్పనిసరిగా ఆర్టీఏ కార్యాలయం నుంచి లైసెన్స్ పొందాలని ఉప రవాణా కమిషనరు షేక్ కరీం తెలిపారు. శుక్రవారం స్థానిక డీటీసీ కార్యాలయంలో జిల్లాలోని అన్ని పార్సిల్ రవాణా సంస్థల యాజమాన్య ప్రతినిధులతో డీటీసీ కరీం సమావేశం నిర్వహించి, వారికి చట్టంపై అవగాహన కల్పించారు. సోమవారం నాటికి జిల్లాలోని అన్ని పార్సిల్ రవాణా సంస్థలు ఆర్టీఏ లైసెన్స్ పొందాలని, లేనిపక్షంలో వాహనాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామన్నారు. సమావేశంలో వాహన తనిఖీ అధికారులు ఎస్‌డీ విఠల్, ఎస్‌బీ శేఖర్, పీ. రమేష్ బాబు, పార్సిల్స్ రవాణా సంస్థల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలలు పాత విధానంలోనే కొనసాగించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర విద్యా శాఖ నూతనంగా ఏర్పాటు చేస్తున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ విధానాన్ని అనేక మంది తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్న దృష్ట్యా ఆ విధానాన్ని పునఃపరిశీలించాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీ శ్రీను, పీ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాత పద్ధతిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల వ్యవస్థను కొనసాగించాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పాఠశాలల రేషనలైజేషన్ నిబంధనల్లో కొన్ని అసంబద్ధమైన విధానాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. స్కూల్ అసిస్టెంట్లను ఎలిమెంటరీ పాఠశాలకు కేటాయించడం, రెండు మూడుసార్లు రేషనలైజేషన్‌కు గురైన ఉపాధ్యాయులకు సరైన న్యాయం జరగకపోవడం, హైస్కూల్‌లో సెక్షన్‌కు 54 మందిని పరిగణించడం ఉపాధ్యాయవర్గాలను ఆందోళనకు గురిచేస్తోందన్నారు.

కాంట్రాక్టు బస్సులపై 85 కేసులు



రికార్డులు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గత గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించి కాంట్రాక్టు క్యారేజ్ బస్సులపై 85 కేసులు నమోదు చేసినట్లు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా కమిషనరు ఆదేశాల మేరకు కాంట్రాక్టు క్యారేజ్ బస్సులపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏలూరు జిల్లాలోని వాహన తనిఖీ అధికారులు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విశాఖపట్నం నుంచి విజయవాడ, విజయవాడ నుంచి విశాఖపట్నం మధ్య తిరిగే కాంట్రాక్టు క్యారేజ్ బస్సులను తనిఖీలు చేసి.. పర్మిట్ నిబంధనలను ఉల్లంఘించిన 85 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.3.70 లక్షలు వసూలు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో ఆర్టీవో ఎండీ. మదని తదితరులు తెలిపారు.

లారీని ఢీకొని వ్యక్తి మృతి

మండవల్లి : మండలంలోని మణుగునూరు మెయిన్ రోడ్డుపై బైక్‌పై వెళ్తున్న ఇంటి రాంబాబు, ముత్యాల లాజరును లారీని ఢీకొనడంతో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. లాజరుకు గాయాలు కాగా ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

క్లుప్తంగా

అక్కమాంబ టెక్స్‌టైల్స్‌లో వైద్యశిబిరం



తణుకులో ఉచిత వైద్యశిబిరంలో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు అక్కమాంబ టెక్స్‌టైల్స్ లిమిటెడ్ కార్మికులకు ఆపిల్ ఆస్పత్రి వైద్యులచే గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ సంబంధిత వ్యాధులకు వైద్యశిబిరం నిర్వహించారు. శుక్రవారం టెక్స్‌టైల్స్ ఆవరణలో మేనేజ్‌మెంట్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో కార్మికులకు ఈసీజీ, ఎకో, బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఆపిల్ ఆస్పత్రి తరపున నెఫ్రాలజిస్ట్, కార్డియాలజిస్ట్, ఫలమనాలజిస్ట్‌లు డాక్టర్ బి.సాయి హరి, డాక్టర్ జీవీపీఎస్ఎన్ రాజు, డాక్టర్ కె.కోటేశ్వర రావు, ఆపిల్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.సుందర రావు, ఏవో బ్రహ్మాజీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనిల్, ఫ్యాక్టరీ ప్రతినిధులు ఎంకె.మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో అన్నదానం



ప్రత్తిపాడులో పూజలందుకొంటున్న కనకదుర్గమ్మ అమ్మవారు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయంలో అన్నదానం ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన తీగెల హరినాథ్‌బాబు కుటుంబ సభ్యులైన సాయిదుర్గ, అభివన్‌వియాన్‌ల పుట్టిన రోజులు పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సర 3వ శుక్రవారం పురస్కరించుకొని ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు సాతులూరి పవన్‌కుమార్ ప్రత్యేక పూజలు చేసారు. కమిటీ అధ్యక్షుడు బడేటి ఉదయ భాను, గ్రామస్తులు, దాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిరాటంకంగా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఈ ప్రతిపాదిత రోడ్ల విస్తరణలో అభ్యంతరాలు తెలుపవచ్చు

తణుకు అర్బన్: తణుకు పురపాలక సంఘ పరిధిలోని 29వ వార్డు కంభంపాటి వారి వీధి డోర్ నంబరు 23.9.7 సర్వే నంబరు 18/4, పైడిపర్రు 32వ వార్డు డోర్ నంబరు 36.4.17 సర్వే నంబరు 81-1, 81-4, 83 (పి) ప్రతిపాదిత రోడ్ల విస్తరణలో భాగంగా జీవోఎంఎస్ నంబరు 4, ఎంఏ అండ్ యూడీ డిపార్టుమెంట్, రూల్ నంబరు ఎక్స్‌ఐవీ ఇన్ నంబరు 169(1) సీ ప్రకారం ఏమైనా క్లెయిమ్స్, అభ్యంతరాలు ఉంటే ఏడు రోజులలోపు పురపాలక సంఘ కార్యాలయానికి తెలియచేయాల్సిందిగా మునిసిపల్ కమిషనర్ బి.రామ్‌కుమార్ కోరారు.

గూడెంలో రోడ్డు ప్రమాదం



డివైడర్‌పైకి ఎక్కిన టిప్పర్ లారీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): కారుడు ఢీకొట్టి ఆపై డివైడర్ పైకి లారి దూసుకెళ్లిన ఘటన శుక్రవారం తాడేపల్లిగూడెంలో చోటు చేసుకుంది. ఏలూరు-తణుకు రోడ్డులో వెళ్తున్న కారును ఢీకొట్టి అనంతరం టిప్పర్ లారీ డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక జువ్వలపాలెం మునిసిపల్ మాజీ కౌన్సిలర్ కీర్తిశేషులు గుండుమోగుల నరసింహారావు భార్య గుండుమోగుల రామాయమ్మ (101) శుక్రవారం తెల్లవారుజామున వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆమెకు ఆరుగురు సంతానం. పుర ప్రముఖులు గుండుమోగుల బలుసుల రావు ఆరోవ సంతానం. పట్టణ ప్రముఖులు రామాయమ్మ భౌతికకాయానికి, చిత్రపటానికి నివాళులర్పించి, సంతాపం తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ఉండి: మండలంలోని పాందువ్వ శివారులో పేకాట శిబిరం నిర్వహిస్తున్న సమాచారం అందడంతో ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1940 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిఘా లేని నేత్రాలు

- పనిచేసేవి అరకొరే
- నేరాణ్వేషణలో నిఘా నేత్రాలే కీలకం
- దుకాణాల సీసీ కెమెరాలే ఆధారం

తణుకు అర్బన్ : నేరాణ్వేషణ, ప్రమాదాలకు సంబంధించిన వ్యవహారాల్లో కీలకపాత్ర పోషించే సీసీ కెమెరాల (నిఘా నేత్రాలు) చూపు మసకబారింది. వివిధ నేరాలు, చోరీలకు సంబంధించి కీలకపాత్ర పోషించే సీసీ కెమేరాలు అరొకొరగా సేవలందిస్తున్నాయి. తణుకు పట్టణంలోని ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన రహదారుల్లో గతం నుంచి ఉన్న సీసీ కెమెరాలు పాడైపోవడంతో వాటి పనితీరు మందగించింది. దీంతో నేరాలు, చోరీలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు చేసే క్రమంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. ఈ క్రమంలో రహదారులకు ఇరువైపులా ఉన్న వ్యాపార సంస్థలకు చెందిన సీసీ కెమెరాలు ఆధారంగా మారాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల చోరీలు అధికంగా నమోదవుతుండగా సీసీ పుటేజీల ద్వారా నేరస్థులను గుర్తిస్తున్నారు. అంతేకాకుండా గతేడాది తణుకులో భయాందోళన సృష్టించిన బంగారు వ్యాపారి నివాసంలో జరిగిన చోరీలో సైతం సీసీ కెమేరాలు కీలకంగా వ్యవహరించాయి. ఇలా ఏ నేరం జరిగినా ముందుగా పోలీసు అధికారులు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల నుంచి పుటేజీని స్వాధీనం చేసుకుంటున్నారు. తణుకు పట్టణంలో రహదారుల్లో అధికారికంగా ఏర్పాటుచేసిన సీసీ కెమేరాలు పనిచేయకపోవడంతో దుకాణాలు, గృహాల ముందు ఉన్న సీసీ కెమేరాలను పోలీసులు ఆశ్రయించాల్సి వస్తుంది.

9 మాత్రమే పనిచేస్తున్నాయి

తణుకు పట్టణ పరిధిలో మొత్తం 34 సీసీ కెమెరాలు ఉండగా కేవలం 9మాత్రమే పనిచేస్తున్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న కెమేరాల్లో అధికశాతం ఏళ్ల తరబడి ఉండడంతో వాటి పనితీరు సక్రమంగా లేకుండా పోయినట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా ప్రధాన సెంటర్ నరేంద్ర సెంటర్‌లోకూడా సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో పనిచేయని దుస్థితి నెలకొంది. సీసీ కెమేరాల ప్రాధాన్యత నేపథ్యంలో ఇటీవల తణుకు సర్కిల్ ఇనస్పెక్టర్ ఎన్.కొండయ్య ప్రధాన రహదారుల్లో ఉన్న ప్రతి దుకాణం ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. కెమెరాల ఏర్పాటుతో మీ దుకాణాలతోపాటు వివిధ నేరాణ్వేషణకు సద్వినియోగపడతాయని దుకాణదారులకు సూచించారు. ఈ సమస్యపై పట్టణ ఎస్సై శ్రీనివాస్‌ను సాక్షి వివరణ కోరగా పట్టణంలోని కొన్ని సీసీ కెమెరాలు పనిచేయడంలేదని వాటి స్థానంలో కొత్తవి వేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లుగా వివరించారు.



తణుకు నరేంద్ర సెంటర్‌లో పనిచేయని సీసీ కెమెరాలు

జాతీయ సమ్మె జూలై 9కి వాయిదా



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ. ప్రతాప్

తణుకు అర్బన్: లేబరు కోడ్స్‌కు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించాల్సి ఉన్న జాతీయ సమ్మెను జూలై 9వ తేదీకి వాయిదా పడినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ. ప్రతాప్, ఏఐటీయూసీ నాయకులు బొద్దాని నాగరాజు తెలిపారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అన్ని జాతీయ కార్మిక సంఘాలు సమ్మె జూలై 9కి మార్చడం జరిగిందన్నారు. దేశం ఇంత తీవ్రమైన ఆందోళన పరిస్థితులు ఉన్నా, లేబర్ కోడ్స్ అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. లేబర్ కోడ్స్ ద్వారా పని గంటలు మార్చడం, కార్మిక సంఘాల హక్కులు కాలరాయడానికి కేంద్రం ప్రయత్నం చేస్తుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం రూ. 26వేలు ఇవ్వాలని కార్మిక సంఘాలు అడుగుతుంటే, లేబర్ కోడ్స్ ద్వారా రోజుకి రూ.178 ఇస్తామని చెబుతుందని తెలిపారు. లేబర్ కోడ్స్ విషయంలో టీడీపీ, జనసేన పార్టీలు కేంద్రానికి మద్దతును ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండలం కార్యదర్శి గుబ్బల గోపి, పీఎల్ నర్సింహారావు, ఏఐటీయూసీ నాయకులు మందుల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రను విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెల మూడోవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రను విజయవంతం చేయాలని మునిసిపల్ కమీషనర్ యేసుబాబు వెల్లడించారు. శానిటేషన్ సిబ్బందికి సన్మాన కార్యక్రమం, చెట్లు నాటడం, పట్టణంలో ర్యాలీ, చలివేంద్రం ఏర్పాటు తదితర కార్యక్రమాలు ఉంటాయని, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరవుతారని వివరించారు.

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం



ప్రత్తిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం సాధ్యపడుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.పూజిత పేర్కొన్నారు. శనివారం ప్రత్తిపాడులోని కాగులంపాడు ఐసీడీఎస్ సెంటర్‌లో కిషోర్‌వికాశం కార్యక్రమంలో భాగంగా యుక్తవయస్సు బాలికలకు హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) పరీక్షలు నిర్వహించారు. అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూజిత మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు యుక్తవయస్సు బాలికలలో ఆరోగ్యం, పోషణ, ఎన్‌పవర్‌మెంట్ తదతర విషయాలలో అవగాహన కోసం ఈనెల 2 నుంచి జూన్ 10 వరకు పలు ప్రాంతాలలో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దుర్గా భవాని, కేంద్ర నిర్వాహకురాలు గంగాభవాని, ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామంలోని కిశోర్‌బాలికలు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన కార్యక్రమం



రక్తహీనత నివారణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం సచివాలయంలో శుక్రవారం రక్తహీనత నివారణపై కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి మాట్లాడుతూ ఐరన్ లోపం వల్ల రక్తహీనత వస్తుందని, పోషకాలతో కూడిన సంతులిత ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఏ ఆహారంలో పోషకాలు మెండుగా లభిస్తాయో బాలికలకు వివరించారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే వ్యాధుల నియంత్రణ



వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



తణుకులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: దోమలను నివారించడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ ఏడిస్ దోమల కుట్టడం వల్ల డెంగీ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ఇటువంటి దోమలు పుట్టకుండా కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు ఉత్పత్తి అయ్యే నిల్వ ఉన్న మురుగు ప్రాంతాలను గుర్తించి వాటిని శుభ్రం చేయాలన్నారు. నీరు నిల్వ ఉండే నీటి తొట్టెలు, డబ్బాలు మూత పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యకాంతం, పీహెచ్ఎన్ అన్నమ్మ, హెచ్ఎస్ లక్ష్మణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లలో డెంగీ దినోత్సవం

తణుకు అర్బన్: తణుకు మునిసిపాలిటీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్స్ ఆవరణలో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ కె. పృధ్వీరాజ్, డాక్టర్ రాజా నాగ భూషణం, డాక్టర్ ఎన్.డానియల్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ జి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలందరూ ఫ్రైడే డ్రైడే పాటించాలని కోరారు. దోమ పుట్టుకను లార్వా దశలోనే బ్రేక్ వేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె. సత్యన్నారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, వార్డు హెల్త్ సెక్రెటరీలు, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

త్రీడీ ప్రింటింగ్‌దే భవిష్యత్తు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ రంగానికి మంచి భవిష్యత్తు ఉందని ఏపీ నిట్ డీన్ డాక్టర్ జీబీ వీరేష్ కుమార్ తెలిపారు. సంస్థలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై ఐదు రోజులు నిర్వహించిన ఉచిత శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. డాక్టర్ సంతోష కుమార్ అధ్యక్షత వహించారు. వీరేష్ కుమార్ మాట్లాడుతూ వస్తువుల నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టేందుకు త్రీడీ ప్రింటింగ్ ఎంతో ఉపయుక్తం అన్నారు. పలు రంగాల్లో ఉపయోగిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు సాంకేతికతపై నైపుణ్యాలు పెంచుకుని సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసుకోవచ్చునని చెప్పారు. ఆచార్యులు కార్తికేయ శర్మ, డాక్టర్ హైమవతి, 40 మంది విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు పంపిణీ చేశారు.

అభయ గణపతికి పంచామృతాలతో అభిషేకాలు



విశేష అలంకరణలో అభయ గణపతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైశాఖ బహుళ (సంకష్ట హర) చవితి పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో నిత్యాఅర్చనలు, శ్రీ లక్ష్మి సహస్రనామాలు పారాయణం, అనంతరం అభయ గణపతికి పంచామృతాలతో అభిషేకాలు, వ్రతాలు జరిగాయి. నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. విశేష అలంకరణలు నిర్వహించారు. కార్యదర్శి ఇందుకూరి మోహన్ రాజు పర్యవేక్షించారు.

బలుసులమ్మకు విశేష పూజలు:

పట్టణ ఇలవేల్పు బలుసులమ్మకు శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. దాతలు సహాయ సహకారాలతో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజి పర్యవేక్షించారు.

యాప్ ద్వారా మస్తర్ విధానం తక్షణం రద్దు చేయాలి

అత్తిలి: ఉపాధి హామీలో యాప్ ద్వారా మస్తర్ విధానం తక్షణం రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్తిలి మండలం తిరుపతి పురం గ్రామ పంచాయతీ పరిధి శివపురం చెరువులో శుక్రవారం పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు, గోపాలన్ మాట్లాడుతూ ఉపాధి హామీలో ఇటీవల కాలంలో కూలీలపై పని భారం మరింత పెరిగిందని ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్తర విధానం వల్ల పని చేయడం ఒక భాగం అయితే కూలీలు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడిందని దీంతో వృద్ధులు, మహిళలు, వికలాంగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు చెప్పుకొచ్చారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో కూలీలు రావడం వలన జిల్లాలో పని దినాలు రాను రాను తగ్గుముఖం పడుతున్నాయని వారు వాపోయారు. ప్రస్తుతం ఉన్న వంద రోజుల పని దినాలను 200 రోజులు కు పెంచాలని, పెరిగిన ధరలు కనుగుణంగా కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయడం లేదని, చేసిన పనికి నెలలు తరబడి వేతనాలు చెల్లించకపోతే కూలీలు ఏమి తినాలి, ఎలా బతకాలని వారు ప్రశ్నించారు. చేసిన పనికి చట్టం ప్రకారం ప్రతి 15 రోజులకు ఒకసారి వేతనాలు చెల్లించక పోతే వడ్డీతో సహా కలిపి వేతనాలు చెల్లించాలని నిబంధన కచ్చితంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంపన రాజు, కొమ్మన వీర రాఘవులు, మీసాల శ్రీనివాసు, రాపాక సత్యవతి, మల్లుల పావని, రాపాక సువార్త పాల్గొన్నారు.

నేడు గూడెంలో సండే స్కూల్ టీచర్ల శిక్షణ తరగతులు

పెంటపాడు: గూడెం కడకట్ల ఫ్లెట్‌వర్ బ్రిడ్జి సమీపంలో ఈనెల 17న ఉదయం నుంచి సాయంతం వరకు సండేస్కూలు టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గాడ్స్‌మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు ప్రసన్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన జె-127 సంస్థ ప్రతినిధి గాబ్రియేల్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. మూడు సంవత్సరాలకు సంబంధించి సండేస్కూలు విద్యార్థులకు సంబంధించి ఉపయోగపడే పుస్తకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు 83672 09891 సంప్రదించాలన్నారు. జిల్లాలోని సండేస్కూలు టీచర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న శ్రామికులకు రూ.210లు మాత్రమే కూలి పడుతుందని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.307లు వచ్చేలా చూడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని చినతాడేపల్లి, కడియద్ద, పుల్లాయగూడెం గ్రామాల్లో వారు పర్యటించి, ఉపాధి శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.307లు వచ్చేలా సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎం. సత్యనారాయణ, లాయి శివయ్య, పోలుకొండ సోమయ్య, కొయ్యల శ్రీను, పనసకాయల వెంకట మహాలక్ష్మి, చాపల వెంకటరమణ, అడపా ప్రగడ గంగారత్నం పాల్గొన్నారు.

అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో అంకాలమ్మ వారి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించేందుకు మహిళా భక్తులు విశేషంగా తరలివచ్చారు. పంబల కథ ప్రజలకు వినిపించారు. గురువారం రాత్రి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు బండి గణపతి, పులమోలు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: ఒకటో పట్టణంలోని మెంటేవారి తోటకు చెందిన అబ్దుల్ కరీం (45) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అప్పుల బాధతో ఈ నెల 12న పురుగుల మందు తాగాడని, ఏలూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందగా హెడ్ కానిస్టేబుల్ వై.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారన్నారు.

టిప్పర్ల స్వైర విహారం

- ధ్వంసం అవుతున్న సీసీ రోడ్లు
- ఆందోళనలో స్థానిక ప్రజలు



వేప చెట్టు సమీపంలో కల్వర్టు మీదుగా టిప్పర్



12వ వార్డు ఇరుకు రహదారిలో టిప్పర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇరుకు సందులలో టిప్పర్లు తిరగడంతో రోడ్డు ఛిద్రం కావడంతో పాటు డ్రెయిన్ అంచులు, రాంప్‌లు, కల్వర్టులు ధ్వంసం అవుతున్నాయి. ఈ కారణంగా ప్రజల సొమ్ము వృథా అవుతుంది. మునిసిపల్ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం శూన్యం అని స్థానికులు చెబుతున్నారు. వివరాలలోకి వెళ్తితే స్థానిక పాతూరు 12వ వార్డు వేప చెట్టు సమీపంలోని దక్షిణం వైపు సందు ఇరుకుగా ఉంటుంది. ట్రాక్టర్లు తిరిగేందుకు మాత్రమే వీలు ఉంటుంది. అయితే ఈ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటిని తీసివేసి, స్థలాన్ని చదును చేసే కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఇందు కోసం జేసీబీని వినియోగించారు. ఈ వ్యర్థాలను తొలగించి అక్కడ నుంచి తీసుకు వెళ్లేందుకు పది టైర్లు కలిగిన భారీ టిప్పర్లును వినియోగిస్తున్నారు. ఈ టిప్పర్లు రాకపోకలు సాగించడంతో ఇరుకు సీసీరహదారి ఛిద్రం అయిపోయింది. అధిక బరువుతో వెళ్లడం వల్ల కల్వర్టు నాశనం అవుతున్నదని, ర్యాంపులు విరిగిపోతున్నాయని, మురుగు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న తూరులు సైతం పాడువుతున్నాయని లబో దిబోమంటున్నారు. ఇరుకు రహదారులలో భారీ టిప్పర్‌లను ఇతర పెద్ద పెద్ద వెహికల్స్‌ను ఎలా అనుమతి ఇస్తారని పలువురు స్థానికులు కళ్యాణి, లక్ష్మి, పద్మ, శేషవేణి, సరస్వతి, బాబు, తదితరులు ప్రశ్నిస్తున్నారు. రోజు అంతా టిప్పర్స్ ఆ రహదారిపై తిరగడంతో ప్రజలు సైతం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లా పాపలతో ఉన్నామని, సాయంత్రం సమయంలో ఈ రహదారి మార్గంలో వారు ఆటలు ఆడతారని, ఇటువంటి ఇరుకు సందులో భారీ టిప్పర్లు తిరగడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక విద్యుత్ వైర్లు, ఆయా కంపెనీలకు చెందిన నెట్ వైర్లు, కేబుల్ వైర్లు ఉండటం, అవి టిప్పర్ వాహనానికి తగిలి వైర్లు తెగిపోతున్నాయని, సాగిపోతున్నాయని, దీంతో నెట్, కేబుల్ ప్రచారాలకు అంతరాయం ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. విద్యుత్ వైర్లుకు తగలితే ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

గతంలోను ఇంతే

గతంలో సైతం ఈ ఇరుకు రహదారిలో భారీ వాహనాలు వెళ్లడంతో సీసీ రహదారి చాలా చోట్లు ఛిద్రమైంది. డ్రెయినేజీ వ్యవస్థ సైతం పాడైంది. అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన ప్రయోజనం లేకపోవడంతో ప్రజలు ఎవరికి వారే రిపేర్లు చేసుకున్నారు. తిరిగి అవి మళ్లీ టిప్పర్లు కారణంగా పాడవ్వడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు గుర్తించి ట్రాక్టర్లు తిరిగే సందులలో భారీ వాహనాలు ప్రయాణించకుండా తగిన చర్యలు చేపట్టాలని, టిప్పర్ యాజమాన్యానికి, కాంట్రాక్టు ఇచ్చిన ఇంటి యాజమానులకు హెచ్చరికలు చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



భారీ వెహికల్స్ కారణంగా శిథిలమవుతున్న కల్వర్టు

స్క్రీన్-అడిక్షన్

స్మార్ట్‌ఫోన్‌లో బాల్యం బందీ



పాపం, పుణ్యం, ప్రపంచ మార్గం... ఏమీ తెలియని బాల్యం... పాపం... డిజిటల్ బందిఖానాలో ఉంది. మెరుపు మెరిస్తే, వాన కురిస్తే, ఆకాశంలో హరివిల్లు విరిస్తే ఆకాశమంత ఆనందమయ్యే బాల్యం... వాస్తవిక ప్రపంచానికి దూరంగా... కాల్పనిక ప్రపంచంలో గడుపుతోంది. 'స్క్రీన్ అడిక్షన్' బాల్యం పాలిట పెను ముప్పుగా పరిణమించింది. ఎక్కువ స్క్రీన్ టైమ్ పిల్లల మెదడులో మార్పులకు కారణం అవుతుంది అని చెబుతున్నాయి పరిశోధనలు...

'అధిక సమయం స్క్రీన్ ముందు గడపడం వల్ల ఏడు నుంచి ఎనిమిది సంవత్సరాల మధ్య పిల్లలు కంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. స్క్రీన్ అడిక్షన్ వల్ల స్క్రీన్‌పై తాము చూసిన దృశ్యాలను పిల్లలు అనుకరిస్తున్నారు. ఇది వారిలో మానసికంగా ప్రతికూల మార్పులు తెస్తుంది. మూడు సంవత్సరాలలోపు పిల్లలు స్క్రీన్ ముందు ఎక్కువ సమయం గడపడం ప్రమాదకరం' అంటున్నారు వైద్య నిపుణులు.

'బీఎంసీ పబ్లిక్ హెల్త్'లో ప్రచురితమైన రిపోర్ట్ ప్రకారం స్క్రీన్ ముందు ఎక్కువ సమయం గడిపే పిల్లలు కంటి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారిలో మయోపియా రిస్క్ అధికంగా ఉంటుంది. ఎక్కువ సమయం స్క్రీన్ ముందు గడిపే పిల్లలో కాలక్రమేణా రెటినల్ డిటాచ్‌మెంట్, గ్లకోమా, మాక్యులర్ డీజనరేషన్‌లాంటి సమస్యలు రావచ్చు.

వాస్తవ ప్రపంచానికి దూరంగా...

స్క్రీన్ ముందు ఎక్కువ సమయం గడపడం అంటే కాల్పనిక ప్రపంచంలో విహరించడమే. దీని వల్ల పిల్లలు రియల్-వరల్డ్ యాక్టివిటీలకు దూరం అవుతారు.

ఏకాగ్రత ఉండదు. స్నేహితులకు దూరంగా ఒంటరిగా తమ లోకంలో తాము ఉంటారు.

మాటకు దూరంగా కేవలం సైగల ద్వారా తన అవసరాలను అడిగే ధోరణి పెరుగుతుంది. దీనివల్ల మాటల్లో విషయాన్ని సరిగ్గా కమ్యూనికేట్ చేయలేకపోవడంలాంటి సమస్యలు భవిష్యత్తులో ఎదుర్కొంటారు.

అధిక స్క్రీన్ టైమ్ పిల్లల జీవగడియారం (బాడీ క్లాక్), నిద్రపై ప్రభావం చూపుతుంది.

ఫోటోసెన్సిటివ్ ఎపిలెప్సీ

రెండు సంవత్సరాల లోపు పిల్లలను స్క్రీన్‌కు దూరంగా ఉంచాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో) సిఫారసు చేస్తుంది. రెండు నుండి అయిదు సంవత్సరాల మధ్య పిల్లలు వారంలో ఒక గంట లేదా అంతకంటే తక్కువ సమయాన్ని 'స్క్రీన్ టైమ్'గా సిఫారసు చేస్తుంది.

గ్యాడ్జెట్‌ల అధిక వాడకం పిల్లల్లో ఫోటో సెన్సిటివ్ ఎపిలెప్సీకు కారణం అవుతుంది.

పర్సనాలిటీ సింద్రోమ్

'అదేపనిగా ఆన్‌లైన్ వీడియోలు చూడడం, సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడపడం వల్ల పిల్లలు పర్సనాలిటీ సింద్రోమ్ బారిన పడుతున్నారు. రాత్రి కేవలం రెండు, మూడు గంటలు మాత్రమే నిద్ర పోవడం వల్ల పిల్లలు పర్సనాలిటీ ప్రాబ్లమ్స్ ఎదుర్కొంటున్నారు' అంటున్నారు అమెరికాలోని సైకోథెరపిస్ట్ డా.జార్జ్ లిన్

కీలక మార్పులు కనిపించవు

'స్క్రీన్ ముందు ఎక్కువ సమయం గడిపే పిల్లలు నిద్రలేమి, నడుం నొప్పి, బరువు పెరగడం, తల నొప్పి... మొదలైన సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉంది. జననం నుంచి రెండు సంవత్సరాల వయస్సు వరకు గడిచిన కాలం మేధస్సు అభివృద్ధి దశ. ఈ దశలో డిజిటల్ మీడియాకు అలవాటు పడిన పిల్లల్లో వయసు రీత్యా వచ్చే ప్రయోజనకరమైన కీలకమైన మార్పులు కనిపించవు' అంటున్నారు క్లినికల్ సైకాలజిస్ట్ డా.అరుషి దేవన్.

పిల్లలు ఏడుస్తున్నప్పుడు తల్లిదండ్రులు వారి చేతిలో సెల్‌ఫోన్ పెడుతున్నారు. వారు ఠక్కుమని ఏడుపు మాని స్క్రీన్ చూస్తుంటారు. దీని వల్ల ఏడుపు ఆపి తమకు తాముగా కామ్‌గా ఉండడాన్ని పిల్లలు నేర్చుకోలేకపోతున్నారు.

డిజిటల్ సరెండర్

మన దేశంలో ఎనిమిది సంవత్సరాల పిల్లలు కూడా ఎలాంటి పర్యవేక్షణ లేకుండానే ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, స్నాప్‌చాట్‌లాంటి వాటిలో యాక్టివ్‌గా ఉంటున్నారు. స్కూల్‌లో స్క్రీన్-బేస్డ్ హోంవర్క్ ఇస్తున్నారు. చివరికి డే-కేర్స్‌లో కూడా స్క్రీన్‌లను ఉపయోగిస్తున్నారు.

భోజనాలు చేస్తున్నప్పుడు, బయటకు వెళ్లినప్పుడు పిల్లలు అల్లరి చేయకుండా ఉండడానికి ఫోన్‌లను చేతికి ఇస్తున్నారు. 'ఇది పేరెంటింగ్ కాదు. డిజిటల్ సరెండర్' అంటున్నారు నిపుణులు.

ఈ నేపథ్యంలోనే స్మార్ట్‌ఫోన్-ఫ్రీ బాల్యానికి ప్రాధాన్యత పెరిగింది.

అర్థమయ్యేలా చెబితే చాలు...

'నువ్వు సెల్‌ఫోన్ ఎక్కువ సేపు వాడొద్దు' 'కంప్యూటర్ ముందు ఎక్కువ సేపు కూర్చోవద్దు' అని ఆదేశించినట్లుగా కాకుండా అధిక స్క్రీన్‌టైమ్ వల్ల కలిగే నష్టాల గురించి పిల్లలకు సున్నితంగా, అర్థమయ్యేలా చెప్పాలి.

వారు సమస్యను అర్థం చేసుకుంటే పేరెంట్స్‌కు ఎలాంటి సమస్యా ఉండదు.

పరిష్కారాలు ఇవిగో...

- **టెక్-ఫ్రీ జోన్స్:** బెడ్ రూమ్, భోజనాలు చేసే చోటు, ప్రేయర్ ఏరియాలు... మొదలైనవి.
- **వీక్లీ డిజిటల్ ఫాస్టింగ్:** గంటతో మొదలు పెట్టి రోజుల వరకు డిజిటల్ ఫాస్టింగ్‌కు ప్లాన్ చేసుకోవాలి.
- **క్వాలిటీ టైమ్:** పరిమిత సమయం అయినా సరే, ప్రయోజనకరమైన వాటి కోసం సెల్‌ఫోన్‌ను ఉపయోగించాలని పిల్లలకు చెబుతుండాలి. ఉదా: సంగీతం, కోడింగ్, ఆర్ట్....మొదలైనవి. టైమ్ పాస్ కోసం సెల్‌ఫోన్ ఉపయోగించకూడదు అని చెప్పాలి.
- **స్లీప్ ఫస్ట్:** పడుకోవడానికి 90 నిమిషాల ముందు స్క్రీన్‌లను షట్‌డౌన్ చేయాలి. బెడ్‌రూమ్‌లో ఎలాంటి డివైజ్‌లు ఉండకూడదు.

ఇలా చేయకూడదు

- ✗ 'పరీక్షల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకుంటే స్మార్ట్‌ఫోన్ కొనిస్తాను'లాంటి వాగ్దానాలు చేయకూడదు.
- ✗ 'నా ఫ్రెండ్ ఫలానా ఫోన్ వాడుతున్నాడు. నాకు కూడా అలాంటి ఫోన్ కావాలి'లాంటి మాటలు పిల్లల నోటి నుంచి వచ్చినప్పుడు 'అలాగే' అనకూడదు.
- ✗ పిల్లలు ఏదైనా సందర్భంలో బాధలో ఉన్నప్పుడు వారిని సంతోషపెట్టడానికి కొందరు తల్లిదండ్రులు గ్యాడ్జెట్లు, స్మార్ట్‌ఫోన్‌లు కొనిస్తుంటారు. పిల్లలను సంతోషపెట్టడానికి ఇవి మాత్రమే ఏకైక మార్గం కాదనే విషయం తెలుసుకోవాలి.

●

● సంకల్ప బలం

వెయిట్ లిఫ్టర్ బామ్మ @70

వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్‌కి రెడీ ●

అరవై ఎనిమిది సంవత్సరాల వయసులో జిమ్‌లోకి అడుగు పెట్టిన రోషిణి... ఇప్పుడు ఎన్నో వ్యాయామాలలో ఆరి తేరింది. వెయిట్ లిఫ్టింగ్‌లో పట్టు సాధించింది. అమెరికాలో జరగబోయే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'లో పాల్గొనడానికి రెడీ అవుతోంది 70 సంవత్సరాల రోషిణి.



● అజయ్, రోషిణి

కుమారుడితో కలిసి ఢిల్లీలో ఉంటున్న రోషిణికి ఎడమ కాలి మోకాలినొప్పి మొదలైంది. మెట్లు ఎక్కడం, నడవడం కష్టంగా మారింది. ఆమె ఎడమ మోకాలికి ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు గుర్తించారు. కుడి చూపుడు వేలు బలహీనపడింది.

ఫిజియో థెరపీ మొదలు పెట్టింది.

'ఈ టైమ్‌లో అమ్మకు జిమ్ అవసరం ఉంది' అనుకున్నాడు ఆమె కుమారుడు, ఫిట్‌నెస్ కోచ్ అయిన అజయ్.

68 సంవత్సరాల వయసులో తొలిసారిగా జిమ్‌లోకి అడుగు పెట్టింది రోషిణి.

మెల్ల మెల్లగా ఆమెకు సాంత్వన చేకూరింది.

స్ట్రెచ్చింగ్, మూమెంట్ ఎక్సర్‌సైజ్‌లతో మొదలుపెట్టి వర్కవుట్స్‌ను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టింది. రెగ్యులర్ ట్రైనింగ్ వల్ల చేయి బలపడింది. రోజువారీ పనులు కష్టంగా అనిపించేవి కాదు.

జిమ్ ఉత్సాహం ఆమెను వెయిట్ లిఫ్టింగ్ వైపు తీసుకువచ్చింది.

ఇప్పుడు రోషిణి ట్రాప్‌బార్ డెడ్‌లిఫ్ట్‌లో 97 కేజీల బరువు ఎత్తుతుంది.

80 కేజీల కన్వెన్షల్ డెడ్‌లిఫ్ట్స్ చేస్తుంది.

50 కేజీల స్క్వాట్స్ చేస్తుంది.

120 కేజీల లెగ్ ప్రెస్ చేస్తుంది.

4 నిమిషాల పాటు ప్లాంక్ పట్టుకోగలదు.

ప్రతిరోజూ రెండు గంటలు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో చేస్తుంది.

'దువ్వెన పట్టుకోవడం కూడా కష్టమే అని ఒకప్పుడు డాక్టర్లు అమ్మ గురించి చెప్పారు' అని గతాన్ని గుర్తు చేసుకున్నాడు అజయ్. జిమ్‌లో వర్కవుట్స్ పుణ్యమా అని ఇప్పుడు రోషిణికి ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు. వారు ఆమెను ప్రేమగా 'వెయిట్‌లిఫ్టర్ మమ్మీ' అని పిలుచుకుంటారు.

డైట్ విషయానికి వస్తే...

'ఎలాంటి రిస్ట్రిక్షన్‌లు లేవు. నాకు దహీ బల్లే అంటే చాలా ఇష్టం. అలా అని అదేపనిగా తినను. అప్పుడప్పుడు మాత్రమే తింటాను. ఏదైనా ఎక్కువ తీసుకోవడం మంచిది కాదు' అంటుంది ఇంటి భోజనాన్ని ఇష్టపడే రోషిణి.

వచ్చే సంవత్సరం అమెరికాలో జరిగే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'కి ఆమెకు ఆహ్వానం అందింది.

ప్రస్తుతం రోషిణి ఆ ఈవెంట్ కోసం ప్రాక్టీస్ చేస్తోంది.

'ఒకప్పుడు నేను ఇంటికే పరిమితమయ్యేదాన్ని. ఇప్పుడు మాత్రం బయటికి వెళుతున్నాను. రకరకాల కార్యక్రమాలలో పాల్గొంటున్నాను. ఇప్పుడు సంతోషంగా ఉంది' అంటుంది రోషిణి.

'సీనియర్ సిటిజన్స్ జిమ్‌లో వ్యాయామాలు చేసినప్పుడు అది వాళ్లకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. వారి నుంచి యువతరానికి సందేశం అందుతుంది' అంటున్నాడు అజయ్.

●

స్వేచ్ఛగా .. రెక్కలు విప్పేలా...

అమ్మాయిలకు చదువు కాదుకదా.. కనీసం వ్యక్తిగత శుభ్రత పాటించే వెసులుబాటు కూడా లేని చోట అందాల పోటీలంటే ఆనందంగా సాగనంపుతారా? పంపరు! అయోమ్ టీటో మతీజ్‌కు కూడా తీవ్ర నిరసన ఎదురైంది! అయినా వెనకడుగు వేయకుండా అందాల పోటీలకు అటెండ్ అయింది.. మిస్ సౌత్ సుడాన్‌గా కిరీటం ధరించి మిస్ వరల్డ్‌కి పోటీపడ్డానికి హైదరాబాద్ చేరుకుంది. తన దేశ పరిస్థితులు, వ్యక్తిగత వివరాలు, తన లక్ష్యం వగైరా ఆమె మాటల్లోనే...



> మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్లు కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్లకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి.



"లా చదివాను. లీగల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. సౌత్ సుడాన్‌లో పుట్టాను. కానీ అక్కడి రాజకీయ అనిశ్చితి వల్ల మా అమ్మ మమ్మల్ని తీసుకుని కెనడాకు వలస వచ్చేసింది. అందుకే నేను అక్కడే పెరిగాను. మా నాన్న, ఆయన తరపు, అమ్మ తరపు బంధువులంతా సౌత్ సుడాన్‌లోనే ఉండిపోయారు. మా అమ్మ కెనడాలో టీచర్‌గా ట్రెన్ అయ్యి, మా సొంత దేశంలోని పిల్లలకు మంచి స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి తిరిగి సుడాన్ వచ్చేసింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత 2019లో నేను మా కుటుంబాన్ని చూడ్డానికి నా సొంత దేశానికి వెళ్లాను. ఎమోషనలే కాదు.. కొంచెం షాక్ కూడా అయ్యాను. కెనడాలో నేను ఆస్వాదించిన జీవితం, సౌత్ సుడాన్‌లో మా వాళ్లంతా అనుభవిస్తున్న జీవితాన్ని బేరీజు వేసుకుని. అప్పుడే డిసైడ్ చేసుకున్నాను నా దేశ ప్రజలకూ ఉన్నత ప్రమాణాల జీవితం అందేలా కృషి చేయాలని! కోవిడ్ తర్వాత వచ్చేశాను. సర్వీస్ మొదలు పెట్టాను. నా బ్యూటీ విత్ పర్పస్ అదే!

అందాల పోటీలకు వ్యతిరేకం

అందాల పోటీల పట్ల సౌత్ సుడాన్‌లో చాలా వ్యతిరేకత ఉంది. నేను మిస్ సౌత్ సుడాన్ పాజెంట్‌లో పాల్గొంటున్నప్పుడు, ఇప్పుడు కూడా నిరసన ఎదురైంది. కానీ నా దృష్టిలో ఈ పోటీలు స్కిన్ షో కాదు. వైవిధ్యమైన సంస్కృతులు, భాషలు, జీవనశైలులను పరిశీలించే, అధ్యయనం చేసే అవకాశాన్నిచ్చే వేదిక. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. సర్దుబాటు, సహనాన్ని నేర్పిస్తుంది. ఇవన్నీ కూడా నా సామాజిక బాధ్యతను మెరుగ్గా నిర్వర్తించేందుకు తోడ్పడతాయి. అందుకే నిరసనను ఎదుర్కొని మరీ ఈ పోటీకి వచ్చాను. అంతేకాదు ఈ పోటీలు ఒకరినొకరు తెలుసుకుని, అర్థం చేసుకుని, ఒకరికొకరు సాయం అందించుకునే స్ఫూర్తినీ పంచుతాయి. మహిళలకు అలాంటి స్ఫూర్తి, ప్రేరణ అవసరం. దానికి అందాల పోటీలే కావాలా అంటారేమో! స్త్రీకి స్త్రీయే శత్రువు అనే నానుడి ప్రపంచ వ్యాప్తంగా పాతుకుపోయి.. అది స్త్రీల సహజ లక్షణమనే అభిప్రాయమూ అంతే లోతుగా నాటుకుపోయింది. దాన్ని అబద్ధమని నిరూపిస్తున్నాయి ఈ పోటీలు! కొన్ని దేశాల పేర్లే తెలియవు నేనీ కంటెస్ట్‌కి వచ్చే దాకా! అందుకే పట్టు బట్టి మరీ ఈ పోటీకి వచ్చాను. ఇక్కడి వైవిధ్యత, ఆధ్యాత్మికత నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి. ఈ దేశంలోని వాళ్లను చూస్తే నాకు ఫారినర్స్‌గా అనిపించరు. మా వాళ్లలాగే అనిపిస్తారు. ఎప్పుడో ఎక్కడో తప్పిపోయి.. ఇప్పుడు కలుసుకుంటున్నామేమో అనిపిస్తోంది! తెలంగాణ గురించి చెప్పుకోవాల్సి వస్తే ఇక్కడి ఎడ్యుకేషన్, మెడికల్ కేర్ గురించి కచ్చితంగా మాట్లాడుకోవాలి. ప్రపంచ ప్రమాణాలతో పోటీపడుతున్నాయి. సౌత్ సుడాన్ యువత తమ ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కే వస్తోంది. మా దేశంలోని చాలామంది ప్రజలు ఆరోగ్య అవసరాల కోసం ఇక్కడి హాస్పిటల్స్‌నే ఆశ్రయిస్తున్నారు.

బాల్య వివాహాలు.. బలవంతపు పెళ్లిళ్లు

ప్రపంచంలోని అనేక దేశాల్లాగే సౌత్ సుడాన్‌లోనూ పురుషాధిపత్యమే! కొడుకుకే ప్రాధాన్యం. అమ్మాయికి వ్యక్తిగత శుభ్రత విషయంలోనూ ఆర్థికపరమైన వెసులుబాటు ఉండదు. బాల్యవివాహాలు, బలవంతపు పెళ్లిళ్లు కామన్. ఇక చదువుకునే అవకాశమెక్కడిది? నేను ఇక్కడిదాకా రాగలిగాను అంటే మా అమ్మే కారణం. మమ్మల్ని ఆమె కెనడా గనుక తీసుకువెళ్లకపోయుంటే నా పరిస్థితి ఎలా ఉండేదో (ఈ మాట చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో నీళ్లు). నాకింకా గుర్తు.. ఆమె లగేజ్ సర్దుతుంటే 'మనం ఎక్కడికి వెళ్తున్నాం?' అని అడిగాను. 'మీరు స్వేచ్ఛగా మీకు నచ్చింది చదువుకునే చాన్స్ ఉన్నచోటికి' అని చెప్పింది! మేం నలుగురు అక్కచెల్లెళ్లం. మాకొక తమ్ముడు. అందరినీ సింగిల్ పేరెంట్‌గానే పెంచింది అమ్మ. ఎలాంటి అవకాశాల కోసం అమ్మ మమ్మల్ని కెనడాకు తీసుకెళ్లిందో అలాంటి అవకాశాలనే సౌత్ సుడాన్‌లోని అమ్మాయిలకూ కల్పిస్తోంది తాను నడిపిస్తున్న స్కూల్ ద్వారా! ఆమె చేస్తున్న ఆ సర్వీస్‌కి నేనూ శాయశక్తుల సాయపడుతున్నాను. మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్ల కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్లకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి. సాధికారతకు, సామాజిక బాధ్యతకు ఐకాన్స్‌గా ఉండి, తర్వాత తరాలను ఇన్‌స్పైర్ చేసేలా వాళ్లను తీర్చిదిద్దాలి. ఇదంత సులువైన జర్నీ కాదు. అయినా ప్రయత్నం వీడను!" అంటూ తన జర్నీ గురించి చెప్పారు మిస్ సౌత్ సూడాన్.

– సరస్వతి రమ

ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్


అయోమ్ టీటో మతీజ్, మిస్ సౌత్ సుడాన్

ఎండాకాలం వచ్చిందంటే గృహిణులకు చేతినిండా పనే.
ఎండను డబ్బాల్లో దాచి పెట్టాల్సిందే...
అప్పడాలు, వడియాల పని పట్టాల్సిందే!
పప్పులో.. పులుసులో.. సాంబారులో.. రసంలో...
ఇలా దేనిలో నంచుకున్నా ఆ రుచి అదుర్స్.
అన్నింటినీ మించి అప్పడం ఒక్కటి ఉంటే చాలు...
విందు భోజనం చేసిన ఫీలింగ్ వచ్చేస్తుంది.
అయితే ఎప్పటిలా రొటీన్ రుచులు కాకుండా
కాస్త వెరైటీ అప్పడాలివి... ప్రయత్నించి చూస్తారా?

అప్పడాలతో అదిరే విందు

వంటిల్లు

సగ్గుబియ్యం అప్పడాలు



కావలసినవి: సగ్గుబియ్యం – ఒక కప్పు (కడిగి, సగ్గుబియ్యం రకాన్ని బట్టి, 3 గంటలు లేదా రాత్రి అంతా నానబెట్టుకోవాలి); నీరు – సరిపడా; ఉప్పు – తగినంత; జీలకర్ర – అర టీస్పూన్; నువ్వులు – ఒక టీ స్పూన్ (అభిరుచిని బట్టి); పచ్చిమిర్చి పేస్ట్ – ఒక టీస్పూన్ (అభిరుచిని బట్టి); నిమ్మ రసం – అర టీస్పూన్.

తయారీ: ముందుగా మందపాటి గిన్నెలో 4 కప్పుల నీరు పోసి మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు, నానబెట్టిన సగ్గుబియ్యంలోని నీరు వంపేసి, మరిగే నీటిలో వేసుకోవాలి. కాసేపటికి ఉప్పు, జీలకర్ర, నువ్వులు, పచ్చిమిర్చి పేస్ట్ వేసుకుని బాగా కలుపుకోవాలి. మంటను మీడియంకు తగ్గించి, సగ్గుబియ్యం పూర్తిగా ఉడికే వరకూ అడుగంటకుండా, మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. సగ్గుబియ్యం ఉడికిన తర్వాత, అది జిగురుగా మారుతుంది. ఒకవేళ మరీ గట్టిగా అనిపిస్తే కొద్దిగా నీరు కలపవచ్చు. చివరగా నిమ్మరసం కలిపి ఒకసారి కలుపుకొని స్టవ్ ఆఫ్ చేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా చల్లారనివ్వాలి. మరీ పూర్తిగా చల్లారకుండా, గోరువెచ్చగా ఉండగానే, ఒక ప్లాస్టిక్ షీట్‌ను ఎండలో లేదా ఇంట్లోనే నేల మీద పరచుకుని, ఒక చిన్న స్పూన్ సహాయంతో కొద్ది కొద్దిగా సగ్గుబియ్యం మిశ్రమాన్ని గుండ్రంగా లేదా మీకు నచ్చిన ఆకారంలో అప్పడాల్లాగా వేసుకోవాలి. ఒకదానికొకటి కాస్తంత దూరం ఉంచాలి. వీటిని 2 లేదా 3 రోజుల పాటు ఎండలో బాగా ఆరనివ్వాలి. అప్పడాలు గట్టిగా తయారవ్వాలి. ఒకవైపు ఆరిన తర్వాత రెండోవైపుకు తిప్పి ఆరబెట్టాలి. అప్పడాలు పూర్తిగా ఆరిన తర్వాత, వాటిని ఒక ఎయిర్ టైట్ కంటైనర్‌లో నిల్వ చేసుకోవచ్చు. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.

మిరియాల అప్పడాలు



కావలసినవి: బియ్యం పిండి – ఒక కప్పు; మిరియాల పొడి – 2 టీస్పూన్లు; ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– అర టీస్పూన్; వంట సోడా – చిటికెడు; నీళ్లు – కొద్దిగా; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ఒక గిన్నెలో కప్పు నీళ్లు పోసి మరుగుతుండగా మిరియాల పొడి, ఉప్పు, జీలకర్ర పొడి, వంటసోడా వేయాలి. కాసేపు మరిగాక అందులో బియ్యం పిండి వేసి అడుగంటకుండా బాగా కలపాలి. స్టవ్ మీదినుంచి దించేసి కాస్త చల్లారాక అందులో రెండు స్పూన్ల నూనె వేసి మరోసారి కలిపి, చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని గుండ్రని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. వీటిని ఎండలో ఒకటి లేదా రెండు రోజుల పాటు బాగా ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత వాటిని ఒక గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు.

టమాటో అప్పడాలు



కావలసినవి: టమాటోలు – అరకేజీ; బియ్యం పిండి – రెండు కప్పులు; సగ్గుబియ్యం – కప్పు (నానబెట్టినవి); పచ్చిమిర్చి – 2 లేదా 3 (కట్ చేసి పేస్ట్‌లా చేసుకోవాలి); ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– టీస్పూన్; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

తయారీ: టమాటోలను బాగా కడిగి, కట్ చేసి, మెత్తగా, గుజ్జులా చేసుకోవాలి. ఒక గిన్నెలో బియ్యంపిండి, నానబెట్టిన సగ్గుబియ్యం, టమాటో గుజ్జు, తరిగిన పచ్చిమిర్చి పేస్ట్, ఉప్పు, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. అవసరమైతే కొద్దిగా నీరు చేర్చి మెత్తని పిండిలా చేసుకోవాలి. ఈ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. ఈ అప్పడాలను ఎండలో 2 లేదా 3 రోజుల పాటు బాగా ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత వాటిని నిల్వ చేసుకోవచ్చు.

కూల్ రూఫ్ టెక్నాలజీ



కూల్ సమ్మర్

పెరుగుతున్న వేడిని తట్టుకోవడానికి సామాన్యులు తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతుల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇందులో కూల్ రూఫ్స్ ప్రోగ్రామ్ ఒకటి. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా టైటానియం ఆక్సైడ్‌లాంటి మెటీరియల్‌తో తయారుచేసిన ప్రత్యేకమైన వైట్ పెయింట్‌ను రూఫ్ టాప్‌లకు వేస్తారు.

దీనికి ముందు రూఫ్‌ను చెత్త, మురికి లేకుండా శుభ్రపరుస్తారు. 'వైట్ పెయింట్ వల్ల ఏ మేరకు ఫలితం ఉంటుంది?' అనే విషయానికి వస్తే... ఉష్ణోగ్రతలలో చెప్పుకోదగ్గ తగ్గుదల కనిపిస్తుందని ప్రాథమిక పరీక్ష ఫలితాలు తెలియజేస్తున్నాయి. 'సోలార్ రెఫ్లెక్టివ్ వైట్ పెయింట్ నార్మల్ పెయింట్ కాదు' అంటుంది అహ్మదాబాద్‌లోని 'మహిళా హౌజింగ్ ట్రస్ట్' మేనేజర్ దీపిక వద్గామ.

'రూఫ్‌కు రెండుసార్లు పెయింట్ వేయడం మంచిది. మొదటి లేయర్‌కు, రెండో లేయర్‌కు మధ్య కనీసం రెండు గంటల విరామం ఉండాలి' అంటుంది దీపిక. 'అధిక వేడి వల్ల ఇబ్బంది పడకుండా హోమ్-బేస్ వర్కర్స్‌కు కూల్ రూఫ్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. వారు చేసే పనికి అంతరాయం ఏర్పడకుండా ఉంటుంది' అంటుంది దీపిక. అహ్మదాబాద్‌లోని లాల్ దర్వాజ బస్‌స్టాప్‌ను 'కూల్ బస్ స్టాప్'గా క్లైమేట్-ఫ్రెండ్లీగా డిజైన్ చేశారు.

'ఒకప్పుడు వేసవికాలంలో ఇంట్లో ఉండడం కష్టంగా ఉండేది. వేడి తట్టుకోలేక కుట్టుమిషన్ పని ఆపేయాల్సి వచ్చేది. సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్ వల్ల ఇంట్లో వేడి బాగా తగ్గింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసుకోగలుగుతున్నాను. వచ్చే సంవత్సరం కూడా రూఫ్‌కు వైట్ పెయింట్ వేయిస్తాను' అంటుంది సంగీత బెన్ అనే గృహిణి.